రాజకీయాల్లో 'కాకా'కు ప్రత్యేక స్థానం

మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి (కాకా) రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని పేర్కొన్నారు. ఆయన జీవితం పేదల సంక్షేమానికి అంకితమైందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో చేసిన సంస్కరణలు ఇప్పటికీ అమలులో ఉన్నాయని చెప్పారు. ఆయన ఆశయానికి నేటి యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా, కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంకర టిప్పర్లను తిరగనియ్యం

అధిక లోడుతో వెళ్తున్న కంకర టిప్పర్లను అడ్డుకున్న ప్రజలు, నాయకులు

టిప్పర్లను అడ్డుకున్న మాదారం గ్రామస్తులు

జిన్నారం, అక్టోబర్ 5: ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న కంకర టిప్పర్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసం అవుతున్నదని, వీటి ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని మాదారం గ్రామస్తులు శనివారం ఆందోళన చేశారు. గ్రామ పరిధిలోని కంకర క్రషర్ల నుంచి లోడుతో వచ్చిన టిప్పర్లను మాదారం, జానకంపేట, వడక్‌పల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. టిప్పర్‌లో 21 టన్నులు మాత్రమే ఉండాల్సి ఉండగా 40 నుంచి 60 టన్నుల కంకర, డస్ట్‌ను అక్రమంగా తరలిస్తూ రింగురోడ్డు వరకు రోడ్డును ధ్వంసం చేశారని మండిపడ్డారు. ధ్వంసమైన రోడ్డును ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి అమీన్‌పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాదారం మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, జానకంపేట మాజీ సర్పంచ్ పాండు గ్రామస్తులు పరిశీలించారు. రోడ్డును కంకర క్రషర్ యాజమాన్యాలే బాగు చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో కంకర లోడ్‌తో ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. భారీగా గుంతలు పడిన చోట రెండు టిప్పర్ల కంకర, డస్ట్ వేయించారు. సరైన పత్రాలు లేకపోవడంతో ఆ రెండు టిప్పర్లను సీజ్ చేసి ఆర్‌టీవో కార్యాలయానికి తరలించారు. కంకర క్రషర్ల నుంచి వాహనాలు రోడ్డుపైకి రాకుండా జేసీబీతో కాల్వ తీయించారు. ఓఆర్‌ఆర్ వరకు రీబీటీ వేసే వరకు ఊరుకోమని హెచ్చరించారు.

ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

పుల్కల్, అక్టోబర్ 5: ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మండలంలోని ఇసోజిపేట గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన సందర్భంగా శనివారం అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇప్పటివరకు కుటుంబ సభ్యుల సర్వే నిర్వహించారు. ఇంకా ఎన్ని కుటుంబాలు మిగిలి ఉన్నాయంటూ ఎంపీడీఓ ఆనంద్ మేరీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఓ ఇంటి వద్దకు వెళ్లి కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉన్నారని యజమానితో మాట్లాడారు. ప్రభుత్వం పక్కా ప్రణాళికతో సర్వే నిర్వహించిన అనంతరం ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందజేస్తుందన్నారు. సర్వే కోసం వచ్చిన అధికారులకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీపీవో సాయిబాబా, తహసీల్దార్ కృష్ణ, ఎంపీవో శ్రీకాంత్ ఉన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఎంపీడీఓకు సూచిస్తున్న కలెక్టర్ క్రాంతి

కుటుంబ వివరాలు నమోదు చేయాలి

నారాయణఖేడ్, అక్టోబర్ 5: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు మంగల్‌పేట్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు సర్వేను శనివారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఉమ్మడి కుటుంబంలో కొత్తగా పెండ్లయిన వారిని ఒక కుటుంబంగా పరిగణించాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోకచక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఉన్నారు.

తెల్లాపూర్‌లో డిజిటల్ సర్వే

రామచంద్రాపురం, అక్టోబర్ 5: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ 3వ వార్డులో అధికారులు నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వేని శనివారం సీఎంవో ప్రత్యేక కార్యదర్శి సంగీత పరిశీలించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుని పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకున్నట్లు తెలిపారు. వార్డులో మొత్తం 287 ఇండ్లు ఉండగా ఇప్పటివరకు 277 ఇండ్లు సర్వే చేశామని, రాత్రి వరకు మిగతా ఇండ్లను కూడా సర్వే పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సీఎంవో ప్రత్యేక కార్యదర్శి సంగీత వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, ఏఈ మౌనిక ఉన్నారు.

సర్వేను సక్రమంగా చేపట్టాలి

కంది, అక్టోబర్ 5: ఫ్యామిలీ డిజిటల్ సర్వేను సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తోపుగొండలో పైలెట్ ప్రాజెక్ట్ కింద కొనసాగుతున్న సర్వేను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: డీఎస్సీ 2024లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు సంబంధించి 1:3లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఐదు రోజులుగా స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో జరిగిన ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన శనివారం పూర్తయింది. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ధ్రువపత్రాల పరిశీలనలో భాగంగా ఎస్‌జీటీ విభాగంలో 765 మంది అభ్యర్థులకు 712 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 240 మంది అభ్యర్థులకు 223 మంది, లాంగ్వేజ్ పండిట్స్ విభాగంలో 43 మందికి 41 మంది, పీఈటీ విభాగంలో 15 మందికి 15 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందన్నారు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్స్, పీఈటీ విభాగంలో 58 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 17 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు గైర్హాజరయ్యారని వెల్లడించారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న టీఎస్ ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్

జహీరాబాద్, అక్టోబర్ 5: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని టీఎస్ ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని తన స్వగృహంలో కోహీర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.1.50 లక్షల చెక్కును అందజేశారు. నాయకులు జలీల్ హమ్మద్, యూసుఫ్ పటేల్ పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

హత్నూర, అక్టోబర్ 5: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, కుంటలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరించారు. శనివారం హత్నూర మండలం ముచ్చర్ల, బోర్పట్ల శివారుల్లోని చెరువులు, కుంటలను పరిశీలించారు. బోర్పట్ల శివారులోని కంసాని కుంట, న్యారెటివానికుంట, వనప్పకుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో వాటిని పరిశీలించి హద్దులు సేకరించారు. ముచ్చర్ల శివారులోని నాగేటికుంట కోర్టుకేసులో ఉండటంతో ఆర్డీవో ఆదేశాల మేరకు నర్సాపూర్, హత్నూర తహసీల్దార్లు అక్కడకు వెళ్లి విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, కుంటలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సేకరించిన వివరాల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఫర్వీన్‌షేక్, శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈఈ భూపుత్ర, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముచ్చర్ల శివారులోని నాగేటికుంట వద్ద విచారణ చేపట్టిన అధికారులు

'ఓపెన్'లో ప్రవేశాలకు గడువు పెంపు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు ప్రవేశగడువును ఈ నెల 31 వరకు పొడించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రవేశానికి సంబంధించి ఓసీ పురుషులకు రూ.1,400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలకు రూ.1,000, ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.150, అపరాద రుసుము రూ.100, ఆన్‌లైన్ చార్జీలు అదనంగా ఉంటాయని వివరించారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఓసీ పురుషులకు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలకు రూ.1,200, ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.300, అపరాద రుసుము రూ.200, ఆన్‌లైన్ చార్జీలు అదనంగా ఉంటాయని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రాల్లో నిర్ణీత ఫీజు కంటే అధిక ఫీజులు వసూలు చేస్తే సంబంధిత అధ్యయన కేంద్రాన్ని రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడ్మిషన్ ఫీజును టీఎస్ ఆన్‌లైన్, మీసేవ ద్వారా చెల్లించి రసీదు పొందాలని, ఆ రసీదుతో అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తు ఫారం తోపాటు సమర్పించాలన్నారు. అధ్యాయన కేంద్రాల కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, ఉపాధ్యయ సిబ్బంది విస్తృత ప్రచారం చేసి అభ్యాసకులు అధిక సంఖ్యలో ప్రవేశం పొందేలా చూడాలన్నారు. వివరాలకు కోఆర్డినేటర్ వెంకటస్వామి(8008403635)ను సంప్రదించాలని సూచించారు.

సజావుగా 'ఓపెన్' పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: ఓపెన్ స్కూల్ ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు శనివారం మూడో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ పొలిటికల్ సైన్స్ పరీక్షకు మొత్తం 339 మంది అభ్యాసకులకు 271 మంది హాజరయ్యారు. ఎస్ఎస్సీ గణితం పరీక్షకు 145 మంది అభ్యాసకులకు 114 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ పరీక్షకు మొత్తం 38 మంది అభ్యాసకులకు 32 మంది హాజరయ్యారు. ఎస్ఎస్సీ బిజినెస్ స్టడీస్ పరీక్షకు 12 మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా, 10 మంది హాజరయ్యారు.

పత్తి పంటను పరిశీలిస్తున్నవిద్యార్థులు

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

పుల్కల్, అక్టోబర్ 5: బస్వాపూర్ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులకు పుల్కల్‌లోని మన గ్రోమోర్ కేంద్రంలో శనివారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాలతో పది రోజుల పాటు అవగాహన కార్యక్రమం ఉంటుందని అగ్రికల్చర్ ఉపాధ్యాయురాలు జ్యోతి తెలిపారు. పంటల సాగు, విత్తన ఎంపిక, ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తామన్నారు. మన గ్రోమోర్ కేంద్రం మేనేజర్ సుధాకర్ ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

జిన్నారం, అక్టోబర్ 5: ఊట్ల పంచాయతీ దాదిగూడకు చెందిన వడ్డెపల్లి యాదగిరి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధుకు విషయం తెలుపగా తక్షణసాయంగా రూ.5 వేలు అందించారు. ముదిరాజ్ సంఘం నాయకులు బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. దాది రమేశ్, దేవేందర్, మోతకృష్ణ, రవి, సత్యనారాయణ, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం భవన నిర్మాణానికి విరాళం

గుమ్మడిదల, అక్టోబర్ 5: మండల కేంద్రంలో నిర్మిస్తున్న రెడ్డి సంఘం భవనానికి చిమ్ముల బ్రదర్స్ రూ.6 లక్షలు విరాళం అందజేశారు. శనివారం గుమ్మడిదలలో నిర్మిస్తున్న రెడ్డి సంఘం కమ్యూనిటీ భవనానికి బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, చిమ్ముల నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి కలిసి రూ.6,01,116 విలువ చేసే చెక్కును సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డి, ప్రతినిధి బాల్‌రెడ్డికి అందజేశారు. దేవేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, అమ్మగారి రవీందర్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

విరాళం అందజేస్తున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

లబ్ధిదారులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పక్కన కార్పొరేటర్లు పుష్ప, సింధు

రామచంద్రాపురం, అక్టోబర్ 5: అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్సీపురం తహసీల్ కార్యాలయం ఆవరణంలో 49మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, తెల్లాపూర్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్‌లు రవీందర్‌రెడ్డి, రాజు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్, ఐలేశ్, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జలమండలి అధికారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

డ్రైనేజీ సమస్యలకు నిధులు ఇవ్వాలి

పటాన్‌చెరు, అక్టోబర్ 5: పటాన్‌చెరు డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేందుకు నిధులు కావాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. శనివారం నగరంలోని జలమండలి కార్యాలయంలో అశోక్‌రెడ్డిని కలిశారు. శాంతినగర్, చైతన్యకాలనీ, కృషి డిఫెన్స్ కాలనీ, బండ్లగూడలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.3 కోట్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన అశోక్‌కుమార్ నిధుల కొరత ఉందని అత్యవసర పనుల నిమిత్తం కొన్ని నిధులు మాత్రమే కేటాయిస్తామని చెప్పారని కార్పొరేటర్ తెలిపారు. రెండు నెలల క్రితం నిధులకోసం వెళ్లామని, అప్పుడు కూడా నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

జహీరాబాద్, అక్టోబర్ 5: ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన న్యాల్‌కల్ మండలం వడ్డిగ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోటే చంద్రప్ప(55) శనివారం సాయంత్రం బసవేశ్వర మందిర సమీపంలోని తన ఇంటి వద్ద వరద నీరు మురికికాల్వ నుంచి వెళ్లక పోవడంతో చెత్తాచెదారాన్ని తొలిగించాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ లైట్లతో డెకరేషన్ చేసిన కట్టెను పట్టుకోవడంతో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి స్పృహ తప్పి కింద పడిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు బీదర్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు ధృవీకరించారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వాలి

గజ్వేల్, అక్టోబర్ 5: పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను బోనస్ చెల్లించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, రెగ్యులర్, క్యాజువల్ కార్యికులందరికీ బోనస్ చెల్లించాలన్నారు. సమానపనికి సమాన వేతనం అందజేయాలని కోరారు. ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 1965 చట్టం ప్రకారం పరిశ్రమ లాభనష్టాలకు సంబంధం లేకుండా బోనస్ చెల్లించాలన్నారు.

ఆర్టీసీ అమరవీరులకు నివాళి

జహీరాబాద్, అక్టోబర్ 5: తమ హక్కుల పరిరక్షణ, న్యాయపరమైన డిమాండ్ల సాధనకు 55 రోజుల పాటు జరిపిన సమ్మెలో ఆత్మ బలిదానం చేసిన ఆర్టీసీ అమరవీరులకు కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఆర్టీసీ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ మాణిక్, నాయకులు జీవన్, నరేశ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు, కార్మికులు

వార్డుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

బొల్లారం, అక్టోబర్ 5: ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డ్ గాంధీనగర్, రెండో వార్డు బీసీ కాలనీల్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.50 లక్షల చొప్పున కేటాయించి నిర్మిస్తున్న అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి పాలకవర్గ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలిక వసతుల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రారెడ్డి, చంద్రయ్య, గోపాలమ్మ, ఏఈ కిష్టయ్య, స్థానికులు శ్రీను, గౌస్ కాలనీవాసులు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

కార్మిక ఎన్నికల్లో సీఐటీయూ విజయం

సంబురాలు జరుపుకుంటున్న నాయకులు, కార్మికులు

జహీరాబాద్, అక్టోబర్ 5: జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామ శివారులోని అటోమేటివ్ ఇండియా పరిశ్రమలో శనివారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికలో సీఐటీయూ విజయం సాధించింది. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీని నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం సీఐటీయూ, సీఐఈ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం, పర్మినెంట్‌తో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేసిన సీఐటీయూ నాయకులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సందీప్‌రెడ్డి, సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్, నాయకులు రాజిరెడ్డి, బాల్‌రాజ్, సంగమేశ్, మధుకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు

శేషవాహనంలో ఊరేగుతున్న శ్రీవారు

గుమ్మడిదల, అక్టోబర్ 5: శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతోన్నాయి. శనివారం మండల కేంద్రమైన గుమ్మడిదలలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి అభిషేకాలు, విష్ణు సహస్రనామార్చన చేశారు. శుక్రవారం రాత్రి శ్రీవారిని శేషవాహన సేవలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం శ్రీవారి కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ వంశపారంపర్యకులు కేవీ నర్సింహాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి తెలిపారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బహుమతి అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్, అక్టోబర్ 5: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సీఐ కొండ్ర శ్రీనివాస్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని ఆర్‌బీ గార్డెన్స్‌లో జరిగిన ప్రైవేటు ఒకేషనల్ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో విద్యార్థి దశ అత్యంత ముఖ్యమైనదని, ఈ సమయంలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని అందుకు అనుగుణంగా కష్టపడి చదవాలన్నారు. ఎక్కువ సమయం చదువుకే కేటాయించాలని, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగులు, గంజాయి, మద్యపానం జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. అనంతరం కళాశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిపల్లిలో..

రామచంద్రాపురం: ఓల్డ్ ఆర్సీపురంలో అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

జహీరాబాద్, అక్టోబర్ 5: జహీరాబాద్ పట్టణంలోని భావనీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆలయంలో అమ్మవారికి పూజరులు కుంకుమార్చన, హారతి తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. కాగా స్థానిక పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ప్రతిష్టించి దుర్గామాత అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పరిసరా ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

అన్నపూర్ణాదేవిగా భద్రకాళీమాత

గుమ్మడిదల, అక్టోబర్ 5: మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీమాత అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈవో శశిధర్‌గుప్తా, పర్యవేక్షకుడు సోమయ్య ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కానుకుంటలో సప్తమాత్రిక సహిత మహాంకాళీ ఆలయంలో, గుమ్మడిదల, వీరన్నగూడెం, బొంతపల్లి గ్రామాల్లోని దుర్గమ్మతల్లి మండిరాల్లో, అన్నారం, దోమడుగులో దుర్గాదేవి మండపాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి.



బొల్లారం: అన్నపూర్ణాదేవిగా అమ్మవారు